క్లుప్తంగా

16న కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారాల సభ

విజయవాడకల్చరల్: సాహితీవేత్త కుసుమ ధర్మన్న సాహిత్య సేవా పురస్కారాల సభను ఈ నెల 16వ తేదీన బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్మన్ డాక్టర్ రాధా కుసుమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ ప్రతికా సంపాదకుడు కలిమిశ్రీకి సేవా పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, జానపద వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సినీ గేయ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ పాల్గొంటారన్నారు. సభ అనంతరం జరిగే కవి సమ్మేళనంలో కవులు పాల్గొనాలని కోరారు.

అత్తింటి వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట ఏనుగుల వారి వీధికి చెందిన పఠాన్ షబానాకు 2011వ సంవత్సరంలో విజయవాడ నగరానికి చెందిన ఇమామ్ షరీఫ్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. వివాహం అయినప్పటి నుంచి షబానాను భర్తతో పాటు అత్త నూర్జహాన్, మామ యూసఫ్ షరీఫ్‌లు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్పంచ్‌ల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): పంచాయతీలకు రావాల్సిన నిధులు, విధులపై సీఎం జోక్యం చేసుకుని రాజకీయ పార్టీలు, సర్పంచుల సంఘాలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సర్పంచుల సంఘాలు ఐక్యంగా పోరాడాలని, అప్పుడే ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం మరింత బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాపారావు, కృష్ణమోహన్, పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్, సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు.

ప్రజలు చైతన్యవంతం కావాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఆహార లేమి ఎక్కువ అవుతాయని దాని వల్ల దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతాయని డాక్టర్ ఎస్.సాహితి చెప్పారు. అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మంగళవారం సభ జరిగింది. సాహితి అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న మన లాంటి దేశాల్లో జనాభా పెరుగుదల వల్ల ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలపై ప్రజల్లో చైతన్య రావాలని, అది సాధ్యం కావాలంటే ప్రజలందరూ విద్యావంతులు కావాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

కంకిపాడు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం పోలీసు సిబ్బంది ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లోని ఖాళీ స్థలాల్లో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి బ్యాగులతో వారికి కనిపించారు. వారిద్దరూ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడ్డ నిందితులు ఉప్పలూరు గ్రామానికి చెందిన చిన్నం వెంకట నాగరాజు, గన్నవరం మండలం కొత్తపేటకు చెందిన గండికోట శామ్యూల్‌రాజు గా గుర్తించారు. వీరి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుపై 2015లో గన్నవరం సమీపంలోని ఓ ఇంట్లో చోరీ, 2019లో జగ్గయ్యపేటలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడగా కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపారు.

పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలి



కొత్తపేట సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు, నాయకులు



కుమ్మరిపాలెం సెంటర్‌లో పవన్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న వలంటీర్లు

- వార్డు వలంటీర్ల డిమాండ్
- రెండో రోజూ కొనసాగిన నిరసనలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా రెండో రోజైన మంగళవారం వార్డు వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. 35వ డివిజన్‌లోని 220, 221 సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు బాప్టిస్టనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వలంటీర్లు సౌజన్య, సింధుజ మాట్లాడుతూ.. ప్రజలకు ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా అవ్వా, తాతలకు, దివ్యాంగులకు నేరుగా ఇంటి వద్దనే పింఛన్లు అందిస్తున్న తమపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమన్నారు. కరోనా కష్టకాలంలో కూడా పిల్లపాపలను వదిలి ప్రజలకు సేవచేసిన తమను తప్పు పట్టటం ఆయన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తోందన్నారు. వెంటనే తమకు క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్ బాబు, వలంటీర్లు అనూష, సురేఖ, నాగరాణి, ఉమాపార్వతి, జానకీ, సుజాత, యలమంద, సంగీత్ బాబు, రాజేష్ పాల్గొన్నారు.

పాతబస్తీలో వలంటీర్ల నిరసన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట షాదీఖానా వద్ద వలంటీర్లు మంగళవారం నిరసన చేపట్టారు. పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పవన్ ఫొటోను కాలితో తొక్కుతూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పవన్ ఫొటోలను దహనం చేశారు. నిజాయతీగా ప్రజలకు సేవలందిస్తోన్న తమపై పవన్‌కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయటం సిగ్గుచేటని వారు పేర్కొన్నారు. పవన్ తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. వలంటీర్ల నిరసనకు మద్దతు తెలిపిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం) మాజీ చైర్మన్ తంగెళ్ల రామచంద్రరావు (రాము) మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ దిగజారి మహిళలపై విమర్శలు చేయటం అత్యంత హేయమన్నారు. వలంటీర్లు యావత్ దేశానికి ఆదర్శంగా పని చేస్తుంటే పవన్‌కళ్యాణ్ వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సయ్యద్ అతీక్, అరికటిక కార్పొరేషన్ సభ్యురాలు మంజుభార్గవి, నాయకులు ముదిలి ప్రసన్న, సుబ్బారెడ్డి, బైపిళ్ల రమేష్, నీలిమ, కృష్ణవేణి, రాజగిరి సురేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

పవన్ నోరు అదుపులో పెట్టుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పచ్చ కామెర్ల వాళ్లకు లోకమంతా పచ్చగా కనిపించినట్లు మహిళల పట్ల తప్పుడు భావాలు కలిగిన పవన్ కళ్యాణ్‌కు అందరూ అలాగే కనిపిస్తున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ఆసిఫ్ మండిపడ్డారు. మంగళవారం తన కార్యాలయంలో ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ పవన్ వ్యాఖ్యలను ఖండించారు. కరోనా మహమ్మారి యావత్ ప్రపంచాన్ని కబళిస్తుంటే వలంటీర్ వ్యవస్థ ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజలకు అద్భుతమైన సేవలందించిందన్నారు. కరోనా సమయంలో పవన్, చంద్రబాబు హైదరాబాద్‌లో తలదాచుకొని నెలల తరబడి బయటకురాలేదని వారికి వలంటీర్ల గురించి ఏమి తెలుసని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల కాల్‌మనీ వేధింపులు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభుత్వ మహిళాధికారులపై ఇష్టారాజ్యంగా వ్యవహరించినప్పుడు పవన్‌కళ్యాణ్ ఎక్కడున్నారని, వాటిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వలంటీర్లను ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే పుట్టగతులుండవని హెచ్చరించారు.

విద్యాధరపురంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): తమను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం 44వ డివిజన్ పరిధిలోగల విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద పవన్ కళ్యాణ్ చిత్రపటాలను చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందచేస్తున్న వలంటీర్లు రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది మహిళలు ఉన్నారన్న విషయాన్ని పవన్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. తాము ఏ రాజకీయ పార్టీ పక్షాన పని చేయడం లేదని, అన్ని పార్టీల వారికి అందేలా చూస్తున్నామని అన్నారు. తమపై కిడ్నాప్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి వలంటీర్లకు సంఘీభావం తెలిపారు.

38వ డివిజన్‌లో..

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్ పరిధిలోని వలంటీర్లు పవన్ కళ్యాణ్ ఫొటో ఉన్న పేపర్లను దహనం చేశారు. రాజకీయ లబ్ధి కోసం పవన్ తమను అవమానిస్తూ మాట్లాడటం సరికాదని, ఆయన వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ మద్దతు తెలిపారు.

47వ డివిజన్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై 47వ డివిజన్ పరిధిలోని 151, 146 వార్డు సచివాలయ వలంటీర్లు ధ్వజమెత్తారు. సచివాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలపై పవన్ కళ్యాణ్ ముందు అవగాహన పొందాలన్నారు. కోవిడ్ కాలంలోకూడా ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి వారిని పలకరించి కావల్సిన వైద్య సహాయాన్ని అందించామని గుర్తు చేశారు. ఆ సమయంలో పవన్ ఎక్కడున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ అనే వ్యక్తి తమతో పాటు ఒక రోజు తిరిగితే మా కష్టం ఏమిటో తెలుస్తోందన్నారు. కార్పొరేటర్ గోదావరి గంగ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గోదావరి బాబు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ కూరాకుల నాగ, తాండ్ర ంద్రకుమార్, ఆర క్రాంతికుమార్, బోయళ్ల రాజేష్ పాల్గొన్నారు.



బాప్టిస్టనగర్‌లో పవన్ చిత్రపటాలను దహనం చేస్తున్న వలంటీర్లు



47వ డివిజన్‌లో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

ఫుట్ పాత్ నిర్మాణ పనుల పరిశీలన



ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని బందరు రోడ్డులో గల దూరదర్శన్ ఆఫీసు వద్ద జరుగుతున్న కారిడార్ ఫుట్ పాత్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలో ఉన్న అన్ని ప్రధాన జంక్షన్లు అభివృద్ధి పరిచే విధంగా విజయవాడ నగరపాలక సంస్థ కృషి చేస్తోందని, నగర పరిధిలో రూ. కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధిక జనాభా.. ప్రగతికి అవరోధం



ఉయ్యూరు: అధిక జనాభా.. ప్రగతికి అవరోధమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉయ్యూరులో ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి దీప పాల్గొన్నారు. ముదునూరు, బోళ్లపాడు, కలవపాముల, కడవకొల్లు గ్రామాల్లో ర్యాలీలు జరిగాయి. డాక్టర్ శాంతి శివరామకృష్ణ పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశ శ్రేయస్సు, ఆనందమయ జీవనం కోసం కుటుంబ నియంత్రణ పాటించాలని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంజే మంజూష తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీనగర్‌లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎన్.ఫణికుమార్, హెచ్‌ఎస్ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



ఊర్మిళానగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు, మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను ప్రజలు తప్పుపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్నా గ్రామస్వరాజ్యాన్ని సాధించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని, అటువంటి వ్యవస్థపై అవాక్కులు పేలటం పవన్‌కల్యాణ్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని దుయ్యబెట్టారు. వారాహి యాత్ర పేరుతో రాజకీయం చేస్తున్న పవన్‌కళ్యాణ్‌కు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. తమకు సేవలందిస్తున్న వలంటీర్లను అవమానించిన పవన్‌కల్యాణ్ తన తప్పును సరిదిద్దుకోవాలంటూ హితవు పలికారు. మహిళల పట్ల తనకు ఉన్న అభిప్రాయాలను పవన్‌కళ్యాణ్ మరోసారి బయట పెట్టారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నాలుగేళ్లుగా వలంటీర్లు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కరోనా సమయంలో వారి సేవలు మరువలేమని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో వలంటీర్లు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు.



వలంటీర్ అండగా ఉంటున్నారు..

వలంటీర్లు అండగా ఉంటున్నారు. ప్రభుత్వ పథకాలను అందించే క్రమంలో వారు మాకు చక్కగా సహకరిస్తున్నారు. నాకు ఈబీసీ నేస్తం పథకం వచ్చింది. దానికి సంబంధించిన కాగితాలను పూర్తి చేసి నాకు పథకం వచ్చే విధంగా చూసింది మా వలంటీరే. వారు చాలా మర్యాదగా వ్యవహరిస్తున్నారు.

– ఎస్.పద్మావతి, మల్లికార్జునపేట



వలంటీర్ వల్లే అమ్మఒడి తీసుకుంటున్నా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని అందిస్తోంది. ఆ పథకాన్ని తీసుకోవటంలో మా వలంటీర్ సహకారం ఉంది. నిబంధనలున్న మాకు దానికి సంబంధించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పథకం వచ్చేలా చేశారు. వలంటీర్లను విమర్శించటం చాలా తప్పు. వారు చాలా సేవలందిస్తున్నారు.

– డి.వాసంతి, కొత్తపేట



ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..

వలంటీర్లు ఎప్పటికప్పుడు నన్ను ప్రొత్సాహిస్తూ చేయూత పథకానికి సంబంధించి కాగితాలు పెట్టించారు. చేయూత పథకం ద్వారా వచ్చిన డబ్బులతో కేటరింగ్ నడుపుకుంటున్నాను. ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారు. వాళ్లను తప్పుగా మాట్లాడటం అంటే ఇంట్లో వాళ్లను అన్నట్టే.

సాయమ్మ, మల్లికార్జునపేట



వలంటీర్లను విమర్శించటం సరికాదు

వలంటీర్లను విమర్శించటం సరికాదు. వారు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని అందించేందుకు అన్ని వర్గాలకు చాలా సహకారాన్ని అందిస్తున్నారు. వారి పట్ల తప్పుడు వ్యాఖ్యలు చేయటం, మంచిది కాదు. నాకు చేయూత పథకాన్ని అందించారు. అలాగే మా ఇంట్లో ప్రభుత్వం ఇచ్చే పథకాలను అందిస్తున్నారు.

– వెంకటేశ్వరమ్మ, బ్రాహ్మణవీధి



మొదటి రోజే పెన్షన్ తీసుకుంటున్నా

వలంటీర్ ద్వారా ప్రతి నెలా మొదటి రోజే పెన్షన్ తీసుకుంటున్నాను. మొదటి తేదీ ఉదయమే ఇంటికి వచ్చి పెన్షన్ చేతికిచ్చి వెళ్తారు. గతంలో ఎక్కడికో వెళ్లి లైన్‌లో నిలబడి గంటల కొద్ది చూసుకొని తీసుకొని వచ్చే వాళ్లం. మిషన్ పని చేయకపోతే రోజులు తరబడి తిరిగే వాళ్లం. ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవు.

– గుర్రం శివమ్మ, మల్లికార్జునపేట

వీసా మోసాలపై అప్రమత్తత అవసరం



సెమినార్‌లో ప్రసంగిస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విదేశాలకు వెళ్లే ప్రజలు వీసా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు సూచించారు. అమెరికాతో పాటు విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మధ్యవర్తులు తప్పుడు వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో బెజవాడ బార్ అసోసియేషన్, కావేటి లా ఫర్మ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇమ్మిగ్రేషన్‌లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ దేశాల ఇమ్మిగ్రేషన్ చట్టాలపై అవగాహన కల్పించడం, న్యాయవాద వృత్తిలో ఇమ్మిగ్రేషన్ విభాగంలో ఉపాధి అవకాశాల అవగాహన కోసం సెమినార్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇమ్మిగ్రేషన్ చట్టాలతో పాటు ప్రవాస భారతీయుల న్యాయ వివాదాలు, అంతర్జాతీయ న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని అనుకుంటున్న యువ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. త్వరలో విశాఖపట్నంలోనూ అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. విదేశాల్లో స్థిరపడాలని యోచిస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యువ న్యాయవాదులు వివిధ దేశాల ఇమ్మిగ్రేషన్ చట్టాలు, అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

384 మందికి వైద్య పరీక్షలు



ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ)లో సిబ్బందికి మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని విజయ డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు ప్రారంభించగా, ఉద్యోగులకు, సిబ్బందికి ఉచితంగా ఎముకలు, కీళ్లు, నరాలు, కండాల సమస్యలపై వైద్యపరీక్షలు చేశారు. హాస్పిటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ పర్యవేక్షణలో వైద్యులు రవితేజ, వంశీకృష్ణ, సందీప్, జ్యోతి, ప్రీతీలు వైద్య సేవలు అందించారు. 384 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులను ఉచితంగా అందచేశారు. కీళ్లు, నరాల సమస్యలకు సంబంధించి పలు సూచనలు, ఆహార నియమాలను సిబ్బందికి తెలియజేశారు. విజయ డెయిరీ అధికారులు లక్ష్మణరావు, రాజారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య డివిజన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గంతో దుర్గాభవాని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా సమాఖ్య డివిజన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య 53, 37 డివిజన్ల ప్రథమ మహాసభ మంగళవారం వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షురాలిగా కొట్టు దుర్గ, ఉపాధ్యక్షురాలిగా పొట్లూరి నరసాయమ్మ, ప్రధాన కార్యదర్శి బంకా ఝాన్సీలక్ష్మి, సహాయ కార్యదర్శి కొట్టు జ్యోతి, కోశాధికారి బండారి మరియమ్మ, కమిటీ సభ్యులుగా బి.నాని, ఆర్.లక్ష్మి, కె.దుర్గ, ఆర్.కాసులు, పి.సుజాత, కె.పద్మ ఎన్నికయ్యారు. మహాసభకు ముఖ్య అతిథిగా మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని హాజరై మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారం, చైతన్యం, ఉపాధి కోసం గత ఎనిమిది దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. తొలుత ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పతాకాన్ని సీనియర్ నాయకురాలు కొరగంజి దుర్గాంబ ఆవిష్కరించారు. తమ పోరాటల వల్లే రాజరాజేశ్వరి పేట, సింగ్ నగర్, బుడమేరు మధ్యకట్ట వంటి ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు.అనంతరం సీనియర్ నాయకురాలు కొరగంజి దుర్గాంబకు సత్కారం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, నగర నాయకులు దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి, డివిజన్ ఇన్‌చార్జ్ కొట్టు రమణారావు, డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

70 మందికి వైద్య సేవలు

గన్నవరం రూరల్: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ప్రజలకు వరమని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యులు శివప్రసాద్ చెప్పారు. మంగళవారం మాదలవారి గూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 70మంది రోగులకు వైద్య సేవలందించారు. ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.